## 'తెలంగాణలో స్వర్ణయుగం మొదలైంది'


కురాకుల కృష్ణ

గోల్కొండ: రాష్ట్రంలో స్వర్ణ యుగం ప్రారంభమైందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతోనే తెలంగాణకు మంచి రోజులు మొదలయ్యాయని ఆయన అన్నారు. పోరాట యోధుడు ప్రజల పక్షపాతి అయిన రేవంత్ రెడ్డి బీఆర్‌ఎస్ పాలనలో దివాల తీసిన తెలంగాణను మళ్లీ అభివృద్ధి మార్గంలో నడిపించగలరని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా ఆయన పాలించగలరని ఆయన అన్నారు.

## 'కోట'లో విద్యార్థుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోటలో గురువారం విద్యార్థులు సందడి చేశారు. నగరం నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి వేలాది విద్యార్థులు గోల్కొండకు తరలివచ్చారు. విజ్ఞాన విహార యాత్రలో భాగంగా తమ తమ ఉపాధ్యాయులతో కలిసి వచ్చిన విద్యార్థులు కోటలో కలియతిరిగారు. గోల్కొండ చరిత్రపై తాము తయారు చేస్తున్న ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులు కోటలోని ఫిరంగులు, బావులు, ఎత్తైన కోట గోడలు, భారీ చీకటి గదుల ఫొటోలను తీసుకున్నారు.

# 878 ఓట్ల తేడాతో ఓటమి..

**పాతబస్తీలో పాగాకు విఫలమైన ఎంబీటీ ప్రయత్నం**

- ఈసారి పాతబస్తీలో నాలుగుకు పోటీ చేసినా.. యాకుత్‌పురా పైనే కన్నేసిన ఎంబీటీ
- గెలుపు కోసం అన్నాదమ్ములు చేసిన ప్రయత్నం వృథా
- యాకుత్‌పురాలో కేవలం 878 ఓట్లతో పరాజయం




చార్మినార్: ఎన్నికల్లో పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపిన మజ్లిస్ బచావ్ తహ్రీక్ పార్టీ ఆశించిన ఫలితాలు సాధించడానికి చేసిన కృషి ఫలించలేదు. నాలుగు నియోజకవర్గాల్లో పోటీ చేసినప్పటికీ.. యాకుత్‌పురా పైనే ఎక్కువగా దృష్టిసారించి మజ్లిస్ పార్టీకి ధీటుగా ప్రచారం నిర్వహించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎంబీటీ మజ్లిస్ పార్టీకి ధీటుగా పోటీ ఇస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించడం లేదు. మజ్లిస్ పార్టీ అభ్యర్థులకు పోటీగా అమనుల్లా ఖాన్ తనయులు ఎన్నికల బరిలో ఉంటున్నప్పటికీ..ఇప్పటి వరకు ఎక్కడ విజయం సాధించలేకపోయారు. పాతబస్తీలో మజ్లిస్ పార్టీకి కంచుకోటగా ఉన్న విషయం అందరికి తెలిసిందే. అయినప్పటికీ ఎంబీటీ మజ్లిస్ పార్టీకి ధీటుగా ప్రచారాన్ని నిర్వహించింది. బస్తీల వారీగా సభలు, సమావేశాలు కొనసాగించి ఈసారైనా తమ పార్టీని గెలిపించాలని కోరినప్పటికీ.. ఓటర్లు ఆదరించ లేదు.

**ఈసారి నువ్వా..నేనా..అన్న రీతిలో..**

ఎన్నికలు జరిగిన ప్రతిసారి శక్తివంచన లేకుండా ఎన్నికల బరిలో ఉంటున్న అన్నాదమ్ములకు నిరాశే మిగులుతుంది. ఈసారి మాత్రం పాతబస్తీలో కేవలం చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, కార్వాన్ తదితర నాలుగు నియోజకవర్గాలతో పాటు బోదన్, నిర్మల్ నియోజకవర్గాల నుంచి బలమైన అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దించామని.. పాతబస్తీలో పాగా వేస్తామని ఎంబీటీ అధ్యక్షుడు మాజిదుల్లా ఖాన్ ఫర్హత్ యాకుత్‌పురా ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్ సోదరులిద్దరూ ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఏ ఒక్క నియోజకవర్గం ఓటర్లు వీరిని ఆదరించ లేదు. యాకుత్‌పురాలో మాత్రం ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్ శక్తివంచన మేరకు ఎన్నికల ప్రచారం నిర్వహించి ఒక దశలో ఎంబీటీ గెలుపు అంచుల వరకు వెళ్లింది. మజ్లిస్ పార్టీకి సమానంగా నువ్వా.. నేనా..? అన్న రీతిలో ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులను వెనక్కి నెట్టి మజ్లిస్ పార్టీని ఢీకొట్టింది. ఎట్టకేలకు కేవలం 878 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యింది ఇదిలా ఉండగా.. విజయం సాధించే వరకు పోరాడుతూనే ఉంటామని రాబోయే ఎంపీ, బల్దియా ఎన్నికలకు సిద్ధమవుతామని ఎంబీటీ నాయకులు అంటున్నారు.

**2014 ఎన్నికల్లో ముగ్గురు సోదరులు పోటీ చేసినా..**

- 2014 ఎన్నికల్లో ముగ్గురు సోదరులు ఎన్నికల బరిలో ఉండగా..ఏ ఒక్కరూ విజయం సాధించలేదు.
- డాక్టర్ ఖయ్యూం ఖాన్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి, ఫర్హతుల్లా ఖాన్ యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి, అంజదుల్లా ఖాన్ మలక్‌పేట్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచి మజ్లిస్ పార్టీకి గట్టి పోటీనిచ్చారు.
- పోలింగ్ చివరి నాటికి విస్తృతంగా ప్రచారం నిర్వహించి పోటీలో ఉన్న ఇతర పార్టీల అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు.
- ఆ ఎన్నికల్లో ఎంబీటీ తప్పనిసరిగా విజయం సాధిస్తుందని రాజకీయ పార్టీల పరిశీలకులు అంచనా వేశారు.
- 2014తో పాటు 2018, 2023లో కూడా అందరి అంచనాలను తారుమారు చేస్తూ నగరంలోని ఏడు నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారు.

**సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీతో విభేదించి..**

- సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ, అమానుల్లాఖాన్ మంచి మిత్రులు.
- 1992లో ఒవైసీతో విభేదించిన అమానుల్లాఖాన్ 1993లో మజ్లిస్ బచావ్ తహ్రీక్(ఎంబీటీ) అనే నినాదంతో కొత్తగా పార్టీని ఏర్పాటు చేశారు. అంతకు ముందు మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా 1978, 1983, 1985, 1989లలో నాలుగుసార్లు చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- ఎంబీటీ పార్టీ ఏర్పాటు చేసిన అనంతరం 1994లో మళ్లీ చాంద్రాయణగుట్ట నుంచి విజయం సాధించారు.
- ఈ ఎన్నికల్లో చాంద్రాయణగుట్టతో పాటు యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి ఎంబీటీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన ముంతాజ్ అహ్మద్ ఖాన్ కూడా ఎంబీటీ జెండాపై విజయం సాధించారు.
- అనంతరం ముంతాజ్ అహ్మద్ ఖాన్ మజ్లిస్ పార్టీ తీర్థం పుచ్చుకొని వరుసగా విజయం సాధించారు.

## గోషామహల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా


ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సత్కరిస్తున్న సురేష్‌కుమార్ మాలి

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గాన్ని గ్రేటర్‌లోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. మాలి సమాజ్ హైదరాబాద్ అధ్యక్షుడు, క్రాకరి గ్లాస్ మర్చంట్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు సురేష్‌కుమార్ మాలి ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ..పదేళ్లుగా గోషామహల్‌లో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేశానన్నారు. తన అభివృద్ధిని చూసే ప్రజలు మరోసారి గెలిపించారన్నారు. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా నిరంతరం అభివృద్ధి పనులు చేపడుతూ..వారి సంక్షేమానికి, ప్రగతికి అందుబాటులో ఉంటానన్నారు.

## రాజాసింగ్‌కు అభినందనలు



చార్మినార్: గోషామహల్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాజాసింగ్‌ను నగర బీజేపీ సెంట్రల్ జిల్లా ఇన్‌చార్జి జీవన్ జీ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నగరంలో బీజేపీ పటిష్టం కోసం పాటుపడాల్సిన అవసరముందనే విషయాన్ని ఆయనకు వివరించినట్లు జీవన్ జీ తెలిపారు. ఇప్పటికే నగరంలో బీజేపీ పటిష్టంగా ఉన్నప్పటికీ.. బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఉత్సాహపరిచి పార్టీని మరింత పటిష్టం చేయాలన్నారు.

## ప్రజల రుణం తీర్చుకుంటా: కౌసర్


ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తనను కార్వాన్ ఎమ్మెల్యేగా మూడవ సారి గెలిపించిన ప్రజలకు ఎప్పుడు తాను రుణపడి ఉంటానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయనను గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్లకు చెందిన పలువురు మజ్లిస్ నాయకులు, అభిమానులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఇప్పటి వరకు వమ్ము చేయలేదని మునుముందు కూడా వారి వెంట ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలతో పాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బద్రుద్దీన్, షకీల్ అలీఖాన్, సయ్యద్ అలీ ఉన్నారు.

# విధుల్లోకి గాంబో నాగరాజు!

- కొత్త ప్రభుత్వం రాకతో ఆయనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేత
- తిరిగి విధుల్లో చేర్చుకున్న సీపీడీసీఎల్..
- హర్షం వ్యక్తం చేసిన కార్మికులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ విద్యుత్‌వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గాంబో నాగరాజు తిరిగి విధుల్లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలకంగా పని చేశారు. విద్యుత్ సంస్థల్లో అవినీతి, అక్రమాలు, యాజమాన్యం అనుసరిస్తున్న తప్పుడు విధానాలు, కార్మికుల హక్కులపై తరచూ ప్రశ్నించేవారు. వీటిని జీర్ణించుకోలేని నాటి విద్యుత్ సంస్థల అధికారులు ఆయనపై 2021 మార్చి 6న సస్పెన్షన్ వేటు వేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రభుత్వ శకం ముగిసి..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే విద్యుత్ సంస్థల అధికారులు ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి, ఏసీగార్డ్స్ సబ్‌డివిజన్ పరిధిలో మళ్లీ పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సెంట్రల్ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ బ్రహ్మం ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. కార్మిక నాయకుడు నాగరాజుపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతో తోటి కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

# కచ్చితంగా ఆరు గ్యారంటీల అమలు



చార్మినార్: ఎల్బీ స్టేడియంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మహారాష్ట్ర ఎంపీ ఇమ్రాన్ తో కలిసి హాజరైనట్లు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి తెలిపారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అనంతరం ఆయన పాతబస్తీ కోట్లా అలీజా లోని తన కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీల అమలు కచ్చితంగా జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కుల, మతాలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఖుస్రూ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ ఉమర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి


ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మొదటి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్‌రావు

సుల్తాన్‌బజార్: నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని అలాగే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖకు భాగస్వామ్యం కల్పించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాలి ప్రసాద్‌రావు కోరారు. గురువారం కోఠిలోని ఐఎంఏ హాల్‌లో నూతనంగా ఏర్పడిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ..కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఐఎంఏ రాష్ట్ర శాఖకు 20 వేలకు పైగా సభ్యత్వం కలిగి ఉందని తెలిపారు. దేశంలో అతిపెద్ద పేరు ఉన్న స్వచ్ఛంద సంస్థ తమదన్నారు. వైద్యుల సంక్షేమం కోసం, వారి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఐఎంఏ కృషి చేస్తుందన్నారు. వైద్య ఆరోగ్య విషయంలో ప్రభుత్వానికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరి జనరల్ డాక్టర్ విజయరావు, స్టేట్ సెక్రెటరి రాజేందర్ యాదవ్, ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ బాల్‌రాజ్, అశోక్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ వెంకటరత్నం, ఎలక్టెడ్ ప్రెసిడెంట్ ద్వారకనాథ్‌రెడ్డి, గట్టు శ్రీనివాస్, డాక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

# టీజీఓ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంబి.కృష్ణయాదవ్, ఖాదర్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల సమస్యలను హైదరాబాద్ జిల్లా టీజీఓ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంబి.కృష్ణయాదవ్, కార్యదర్శి ఎంఏ ఖాదర్ పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..నూతన ప్రభుత్వానికి తమ అసోసియేషన్ పూర్తిగా సహకారం అందిస్తుందన్నారు. తమ అధికారులు ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల రవీందర్, సర్వాపరాజీ, ఉంజులా రెడ్డి, శ్రీనేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు రుద్రహోమం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థాన వార్షిక సత్కార పండితులు శైవాగమ ప్రతిష్టాచార్య కాళ్ళకూరి సూర్యశ్రీ చేతుల మీదుగా పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6.30 గంటలకు గణపతిపూజ, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, శైవాగమ పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, త్రిశూల పూజ, మహాన్యాస మంత్రపఠనం, అమృతేశ్వరుడికి 21 ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం రుద్రహోమం, పూర్ణాహుతి, పండిత ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## జనాభా ప్రాతిపదికన మాదిగలకు సముచిత స్థానం ఇవ్వాలి

నాంపల్లి: రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగలకు సముచితమైన స్థానం కల్పించాలని మాదిగ క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగళ్ల పోచయ్య ఇజ్రాయిల్ విజ్ఞప్తి చేశారు. గురువారం నాంపల్లిలో కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్(జూబ్లీహిల్స్) నియోజకవర్గం ఇన్‌చార్జి కటిక దానయ్య, సీనియర్ కాంగ్రెస్ నేత డానియేల్ మాదిగతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన మాదిగలకు మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులను కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో 65 లక్షల మాదిగలు ఉన్నట్లు వివరించారు. మాదిగలకు మంత్రి పదవులతో పాటుగా నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## నూతన ప్రభుత్వంలో మరింత అభివృద్ధి జరగాలి


శాగంటి సోమయ్య

నాంపల్లి: రాష్ట్రంలో సంపూర్ణ మెజార్టీ సాధించిన కాంగ్రెస్(ఐఎన్‌సీ) పార్టీకి, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్‌రెడ్డికి, సహచర మంత్రి మండలి సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి సోమయ్య శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం నాంపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నూతన ప్రభుత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ఉద్యోగుల సహకారం ఉంటుందని పేర్కొన్నారు.

## ఆకట్టుకున్న సీతారామ కల్యాణం


నృత్య రూపకం

గన్‌ఫౌండ్రీ: గో సంరక్షణ గోవర్ధ మంచ్ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో నిర్వహించిన సీతారామ కల్యాణం ఆహుతులను ఆకట్టుకుంది. రంగస్థల కళాకారులు రవళి రమేష్‌బాబు దర్శకత్వంలో సాగిన నృత్యరూపకం, 'అన్నకూట్ బోగ్ బండారా' నాటకం అలరించింది. ఈ కార్యక్రమంలో పూజ్య ప్రభుదాస్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'దొరల పాలన అంతమైంది'


రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న సతీష్‌కుమార్, మనీష్ తదితరులు

అబిడ్స్: దొరల పాలన అంతమై ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, నగర మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ కె.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సతీష్‌కుమార్‌తో పాటు మనీష్, విశాల్ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ..పదేళ్ల తర్వాత తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం దొరలపాలన సాగిస్తూ ఉద్యోగులను, నిరుద్యోగులను, అన్నివర్గాల ప్రజలను వేధింపులకు గురిచేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ బంగారు తెలంగాణగా రూపొందుతుందన్నారు. ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రతిఒక్కరూ ఆనందంగా ఉన్నారన్నారు.

# ఐఎన్‌టీయూసీ విజయోత్సవ సభ




సుల్తాన్‌బజార్: తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు భారీ ర్యాలీ నిర్వహించి విజయోత్సవ సభ నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌సుందర్, రాష్ట్ర నాయకులు పాపయ్య గౌడ్, మేకల నర్సింహారెడ్డి, సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గోవిందరెడ్డి, విజయభాస్కర్, అనిల్ పాల్గొన్నారు.

# కలుషిత నీటి సరఫరాను అరికట్టండి


కలుషిత తాగునీటిని చూపిస్తున్న దృశ్యం

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని ప్రజలు కలుషిత నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుమ్మర్ బస్తీ తదితర ప్రాంతాల్లో గత వారం, పది రోజులుగా కలుషిత తాగు నీరు సరఫరా జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీటిలో పూర్తిగా నీరు కలుషితం కావడంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం వాతావరణంలో నెల కొన్న మార్పులకు తోడు.. కలుషిత తాగు నీటి సరఫరా జరగడంతో తాము ఎలాంటి రోగాల బారిన పడాల్సి వస్తుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కలుషిత నీటి సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. బస్తీ ప్రజలు ఎలాంటి అనారోగ్యానికి గురికాకముందే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని కోరుతున్నారు.

# కిక్కిరిసిన ప్రమాణ స్వీకార మహోత్సవ సభ



నాంపల్లి: ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార మహోత్సవ సభకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఎల్బీ స్టేడియం ఎటు చూసినా జనం కిక్కిరిసిపోయింది. స్టేడియం పూర్తిగా నిండిపోవడంతో చుట్టూ అరకిలోమీటరు మేర జనం బయటకు వచ్చారు. అధిక సంఖ్యలో జనం పోటెత్తడంతో ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులు సైతం చేతులెత్తేశారు. గురువారం మధ్యాహ్నం సరిగ్గా 12.55 నిమిషాలకు ఎల్బీ స్టేడియానికి సీఎల్పీ లీడర్ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడానికి అక్కడికి చేరుకున్నారు. ఆయనతో పాటే ఒకే కాన్వాయ్‌లో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ అక్కడికి చేరుకున్నారు. నేతలు ఎల్బీ స్టేడియానికి చేరుకోవడంతో నినాదాలతో ఆ ప్రాంతమంతా మారు మ్రోగింది. వేదికపైకి చేరుకున్న నేతలు తమ ప్రసంగాలను వినేందుకు ఎగబడ్డారు. ప్రమాణ స్వీకార మహోత్సవం పూర్తవగానే కాంగ్రెస్ శ్రేణులు, రేవంత్‌రెడ్డి అభిమానులు భారీగా బాణాసంచాను పేల్చారు. జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కార్లలో నగరానికి చేరుకున్నారు. ఎల్బీ స్టేడియం చుట్టూ కిలోమీటర్ల మేర కార్లు బారులుదీరి నిలబడ్డాయి. పబ్లిక్‌గార్డెన్, హజ్ హౌస్, హాకా భవన్, నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లలో వాహనాలను పార్కింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. సీఎం కేసీఆర్ ప్రమాణ స్వీకారోత్సవ సభ ముగించుకుని బయటకు వెళ్తుండగా కాన్వాయ్ నుంచి నిలబడి ప్రజలకు అభివాదం చేశారు. రేవంత్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ రేవంత్ రెడ్డి కాన్వాయ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది.

## 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. 'యాంగర్ ఫ్రీ లైఫ్ స్టైల్' అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్ బి.కె. కవిత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాల కోసం 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఆదుకోండి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు నూతన కాంగ్రెస్ ప్రభుత్వం తగు న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం విజ్ఞప్తి చేసింది. గురువారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో నూతన ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మదన్‌మోహన్‌చారి మాట్లాడుతూ.. తెలంగాణలో విశ్వకర్మల ఆకలి చావులు, ఆత్మహత్యలను నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో శ్రీకాంతచార్య మొదలు 42 మంది విశ్వకర్మ జాతి యువ కిశోరాలు ఆత్మ బలిదానం చేసుకున్నప్పటికీ తగిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రచారి, మహిళా సంఘం అధ్యక్షురాలు చిలుకూరి లక్ష్మీ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



అబిడ్స్: కార్తీకమాసం వేడుకలు గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నప్రసాదాలు చేపట్టారు. రాత్రి వరకు కార్తీమాసం దీపాలంకరణ, ఇతర పూజలు చేశారు.

## స్కాలర్‌షిప్‌లను ప్రకటించిన 'ఐఎస్‌బీ'


గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ ప్రధాన భవనం

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) సాయుధ దళాల స్కాలర్‌షిప్‌ను ప్రకటించింది. మాజీ సైనికుల సంక్షేమ శాఖ, రక్షణ మంత్రిత్వశాఖ ఇందుకు తన సహకారాన్ని అందిస్తుంది. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, భారత ప్రభుత్వ మాజీ సైనికుల సంక్షేమ శాఖ కార్యదర్శి విజయ్ కుమార్‌సింగ్ కలిసి ప్రకటించారు. ఈ ప్రకటనతో ఐఎస్‌బీ సాయుధ దళాల అనుభవజ్ఞులకు లేదా పౌర జీవితంలోకి మారే సిబ్బందికి 50 శాతం ట్యూషన్ ఫీజు మినహాయింపును అందిస్తుంది. పోస్టు గ్రాడ్యుయేట్, అధునాతన మేనేజ్‌మెంట్ కోర్సుకు ఇది వర్తిస్తుంది. ప్రతి యేటా 22 మందికి ప్రయోజనం చేకూరుస్తుంది.

## నిమ్స్ కొత్త చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

- మొదటి నుంచి సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైనం
- శుభాకాంక్షలు తెలిపిన నిమ్స్ ఉద్యోగ సంఘాలు



లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇక నుంచి నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ కొనసాగుతారు. బొక్కల దవాఖానా నుంచి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా ఎదిగిన మొదలు నిమ్స్ చైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తూ వస్తున్నారు. అదే క్రమంలో గురువారం రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి నిమ్స్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఎంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈయన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్‌రావులు గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ క్రమంలో నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శిరందాస్, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యగౌడ్, సురేష్ బాబులు కొత్త సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ హయాంతో ఆస్పత్రి విస్తరణ అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.